సెట్విన్ ఆధ్వర్యంలో 15 నుంచి సమ్మర్ క్రాష్ కోర్సులు

యాకుత్‌పురా: ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో నగరంలోని నిరుద్యోగ యువతకు ఈనెల 15వ తేదీ నుంచి సమ్మర్ క్రాష్ కోర్సులను నిర్వహించనున్నట్లు సంస్థ మేనిజింగ్ డైరెక్టర్ కే. వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, యువత, గృహిణిలకు కంప్యూటర్ అవేర్నెస్, గార్మెంట్ మేకింగ్, బ్యూటీషియన్, మెహందీ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రూ. 600 నుంచి 1500 రుసుంతో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పాతబస్తీ మోత్తీగల్లీ, ముషీరాబాద్, చైతన్యపురీ, ఈదిబజార్, నేరేడ్‌మెట్, ఏసీగార్డ్స్, ఈస్ట్ మారేడ్‌పల్లీ, ఎర్రగడ్డ సంస్థ శిక్షణ కేంద్రాలల్లో నిర్వహించనున్నామన్నారు.

నేడు మ్యూజియంకు సెలవు

చార్మినార్: ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగను పురస్కరించుకుని గురువారం సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మ్యూజియం మూసి ఉంటుందని..దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు గమనించాలని కోరారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్టమట్టి పూజలో రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: సీతారాముల నామ జపనతో లంగర్‌హౌస్ ప్రాంతం పునీతమయ్యింది. సంగం సీతారామచంద్రుల బ్రహ్మోత్సవాలు కనులవిందుగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతులు 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేదపండితులు రాజ నర్సింహా చారి ఈ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వైష్ణవ సాంప్రదాయ పద్దతిలో విశ్వక్‌సేనుడిని ఆరాధించారు. అయోధ్య నుండి సాధువులు తరలిరాగా మంగళవాయిద్యాలతో విశ్వక్‌సేనుడిని లంగర్‌హౌస్ వీదుల్లో ఊరేగించారు. అనంతరం పుట్టమట్టి తీసుకువచ్చి యాగశాల ప్రవేశం, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ జగదాంబిక ఆలయ పూజారి శ్రీకాంత్ చారి సాధువులను సన్మానించారు.

నీటి సమస్య పరిష్కరించకపోతే ధర్నా చేస్తాం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గంలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించకుంటే వాటర్‌బోర్డు ఎండీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని గోషామహాల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. జాంబాగ్ ఇండ్లిగల్లీ, గౌలిగూడ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పుష్కలంగా జరగాలన్నారు. నాయకులు మనోహర్ పాటక్, సతీష్, విజయ్, కిషోర్ మహారాజ్, స్వాతి, అశోక్, లక్ష్మీ, కొంకర్ దేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం



డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే గ్రేటర్‌లోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని టీఎన్జీఓస్ హైదారాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. గత పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర శాఖల మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..... ఉద్యోగులకు, అధికారులకు, ప్రజలందరికి టీఎన్జీఓస్ హైదారాబాద్ జిల్లా తరపున రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ సంక్షేమాన్ని జీర్ణించుకోలేని బీజేపీ



గౌరీ సతీష్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాన్ని బీజేపీ జీర్ణించుకోలేక పోతోందని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీష్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..... బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు పలు సంక్షేమ పథకాలు అందించిందని ఆయన వివరించారు.

బీజేపీ గూటికి బంగారి ప్రకాష్



గోల్కొండ: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ పార్టీని వీడనున్నారు. ఆయన త్వరలోనే బీజేపీ గూటికి చేరనున్నారు. ఆయన బీఆర్‌ఎస్‌ను వీడడంతో నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు తీరని నష్టం వాటిళ్లనుంది. గతంలో బీజేపీ క్రియాశీలక సభ్యుడిగా ఉన్న బంగారి ప్రకాష్ 2016లో బీఆర్ఎస్‌లో చేరి గుడిమల్కాపూర్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. గత బల్దియా ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఆయన ఓటమిపాలయ్యారు.

రంజాన్ కిట్ల పంపిణీ



గోల్కొండ: అన్ని వర్గాల ప్రజలు తమతమ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నదే తమ అభిమతం అని గోల్కొండ శ్రీ జగదాంబికా మహాంకాళీ అమ్మవార్ల వృత్తిపని వారి సంఘం అధ్యక్షులు బొమ్మల సాయి బాబాచారి అన్నారు. బుధవారం గోల్కొండ నయాకీలాలో ఆయన పేద ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా తాము పేద ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

పండగ సంబరం

నేడు ఈద్–ఉల్–ఫితర్..

- నెల రోజుల పాటు కొనసాగించిన ఉపవాస దీక్షలు
- ముస్తాభైన మీరాలం ఈద్గా మైదానం, మక్కా మసీదు
- నేడు మీరాలం ఈద్గా రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు





మీరాలం ఈద్గా మైదానంలో ఏర్పాట్లు

చార్మినార్: నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లింలు బుధవారం సాయంత్రం దీక్షలను విరమించి రంజాన్ పండుగకు సిద్ధమయ్యారు. రాత్రి మగ్రీబ్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు పరస్పరం ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. గురువారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ రోజున ప్రత్యేకంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించే ముస్లింలు తప్పనిసరిగా నూతన వస్త్రాలు ధరించాలనే సంప్రదాయం వస్తుండడంతో వాటిని కొనుగోలు చేశారు. దీంతో పాత నగరంలోని ప్రధాన మార్కెట్లన్ని మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు సందడిగా మారాయి.

రంజాన్ మార్కెట్‌లో ఇసుకవేస్తే రాలనంత జనం

చార్మినార్ పరిసర ప్రాంతాలు క్రయ విక్రయాలతో కిటకిటలాడాయి. ఇసుక వేస్తే రాలనంత జనం రోడ్లపై కనిపించింది. పండుగ రోజున ప్రత్యేక వంటకాల కోసం అవసరమైన వస్తు సామాగ్రిని కొనుగోలు చేయడానికి మహిళలు సైతం భారీ ఎత్తున పాతబస్తీకి తరలిరావడంతో పాతనగరంలోని రంజాన్ మార్కెట్లన్ని కళకళలాడాయి. ప్రధానంగా నయాపూల్ నుంచి శాలిబండ వరకు ఉన్న వివిధ దుకాణాలతో పాటు పండుగ కోసం ఫుట్‌పాత్‌తో పాటు రోడ్లపై వెలసిన చిన్న చిన్న టేలా బండి, స్థానిక దుకాణాలలో జోరుగా క్రయ విక్రయాలు కొనసాగాయి. రాత్రంతా నైట్‌బజార్ కొనసాగింది.

గట్టి బందోబస్తు..

ఈద్–ఉల్–ఫితర్ పండుగను పురస్కరించుకుని గురువారం పాతబస్తీలో అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు దక్షిణ మండలం డీసీపీ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా మీరాలం ఈద్గా వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహించిన అనంతరమే సామూహిక ప్రార్థనలకు అనుమతించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈద్–ఉల్–ఫితర్ సామూహిక ప్రార్ధనల కోసం మీరాలం ఈద్గా మైదానాన్ని ఇప్పటికే అన్ని హంగులతో ముస్తాబు చేసారు. గురువారం ఉదయం ఈద్గాలో సామూహిక ప్రార్ధనలు నిర్వహించడానికి వచ్చే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా సామూహిక ప్రార్ధనల కోసం మక్కా మసీదు ముస్తాబైంది. రంగు రంగుల విద్యుత్ దీప కాంతుల్లో మక్కా మసీదు తళుక్కుమంటోంది.

వాహనాల దారి మళ్లింపు..

మీరాలం ఈద్గా రోడ్డులో సామూహిక ప్రార్ధనలు ముగిసేంత వరకు వాహనాలను దారిమళ్లించనున్నారు. ఈద్–ఉల్–ఫితర్ సామూహిక ప్రార్ధనలను పురస్కరించుకొని మీరాలం ఈద్గా తదితర ప్రాంతాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నట్లు దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ కె.లక్ష్మన్ తెలిపారు. మీరాలం ఈద్గా వైపు వచ్చే వాహనాలను పురానాపూల్, బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ల మీదుగా దారి మళ్లిస్తామన్నారు. మీరాలం ఈద్గా క్రాస్ రోడ్డు నుంచి ఈద్గా వైపు ఎటువంటి వాహనాలను అనుమతించమన్నారు. శివరాంపల్లి, ఎన్.పీ.ఏ వైపు నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే వాహనాలన్నింటిని దానమ్మ హట్స్ టీ జంక్షన్ నుంచి అలియాబాద్ వైపు దారి మళ్లిస్తామన్నారు. వాహనదారులు తమతో సహకరించాలని ఆయన కోరారు.

కేసీఆర్‌ను కలిసిన కొల్ల ప్రదీప్‌రాజ్



కేసీఆర్‌తో సమావేశమైన కొల్ల ప్రదీప్‌రాజ్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గోషామహాల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కొల్ల ప్రదీప్‌రాజ్ కలిశారు. ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచేందుకు కష్టపడి పనిచేస్తున్నట్లు ఆయన కేసీఆర్‌కు వివరించారు.

ఈద్‌ముబారక్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిస్కరిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

చార్మినార్: పవిత్రమైన రంజాన్ మాసంలోని ఈద్–ఉల్–ఫితర్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ ఈద్ ముబారక్ తెలియజేస్తున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ రూపొందించిన ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ పోస్టర్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



ఖ్వాజా అబ్దుల్ రహమాన్, ఎస్ఈ

చార్మినార్: రంజాన్ పండుగ (ఈద్–ఉల్–ఫితర్)కు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో సిద్ధంగా ఉంచామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ అబ్దుల్ రహమాన్ అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. గురువారం ఈద్–ఉల్–ఫిత్ర్ పండుగను ఘనంగా నిర్వహించుకోనున్న సందర్భంగా బుధవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం చార్మినార్ డివిజన్‌లోని డీఈ లింగయ్య గౌడ్‌తో పాటు ఏడీఈలు, ఏఈలతో నిరంతర విద్యుత్ సరఫరాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ అవసరమైన మేరకు తమ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి తగిన కార్యాచరణను రూపొందించామన్నారు.

అంతరాయం లేకుండా..

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మక్కా మసీదులో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా యుపీఎస్‌తో పాటు చార్మినార్ ఏడీఈను రౌండ్ ది క్లాక్ విధి నిర్వాహణలో నియమించామన్నారు. అలాగే మక్కా మసీదులో అనివార్య కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే సరఫరాను పునరుద్దరించడానికి ఇప్పటికే మూడు 500 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంచ్ మోహల్లా, మ్యాగ్రిస్ క్యాంప్, చార్మినార్ నిమ్రా హోటల్‌ల వద్ద అత్యవసరంగా ఏర్పాటు చేశామన్నారు. శాలిబండ, మదీనా, ఖిల్వత్, మక్కా మసీదు, చార్మినార్, పత్తర్ గట్టి, గుల్జార్‌హౌస్ తదితర ప్రాంతాల్లో 500 కేవీఏ టెంపరరీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 11 కేవీ జూపార్క్ విద్యుత్ ఫీడర్ నుంచి మీరాలం ఈద్గాకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా మీరాలం వద్ద 500 కేవీఏ టెంపరరీ రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చే శామన్నారు. గత నెల రోజుల పాటు రంజాన్ మాసంలో ఎక్కడ ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తలేదన్నారు.

సత్తాచాటిన నియోరోజరీ విద్యార్థులు



నియోరోజరి విద్యార్థినులతో హైదరాబాద్ జిల్లా డిఈవో రోహిణి

గోల్కొండ: హైదీరాబాద్ జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శినిలో గోల్కొండ మండలానికి చెందిన నియోరోజరి విద్యార్థినులు బహుమతులు గెలిచి సత్తాచాటారు. వీరికి బుధవారం హైదరాబాద్ జిల్లా డిఈవో రోహిణి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రొత్సహాన్ని నింపుతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సి.ధర్మేందర్ రావు, నియోరోజరి సైన్స్ టీచర్ సారాఫాతిమా, ప్రిన్సిపల్ నస్రీన్‌ఫాతిమా పాల్గొన్నారు.

నేడు మాసాబ్‌ట్యాంక్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

గోల్కొండ: మాసాబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో నేడు రంజాన్ ప్రార్థనలు జరగనున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ పోలీసులు మాసాబ్ ట్యాంక్ నుంచి బంజారాహిల్స్, బంజారాహిల్స్ నుంచి మెహిదీపట్నం వచ్చే వాహనాదారులకు పలు సూచనలు చేశారు. గురువారం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు వాహనాలను దారిమళ్లిస్తున్నారు. మెహిదీపట్నం నుంచి మాసాబ్‌ట్యాంక్ మీదుగా లకిడికాపూల్ వెళ్లే వాహనాలు కేవలం ఫ్లైఓవర్ మీద నుంచే వెళ్లాలి. అదే విధంగా లకిడికాపూల్ నుంచి వచ్చే వాహనాలు మాసాబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాలి. ఫ్లైఓవర్ కింద నుంచి వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 నుంచి మాసాబ్‌ట్యాంక్ వెళ్లే వాహనాలను అనుమతి లేదు. ఈ వాహనాలను బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1 నుంచి తాజ్‌కృష్ణా, ఆర్టీఏ ఖైరతాబాద్ కార్యాలయం వైపు మళ్లిస్తారు.

ప్రజల సహకారంతో 40 ఏళ్ల చరిత్ర తిరగరాస్తాం



అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల సహకారంతో బీజేపీ విజయం సాధించి పాతబస్తీని బంజారాహిల్స్, జూబ్లిహిల్స్ తరహాలో అభివృద్ధి చేస్తామని మాజీ శాసనమండలి సభ్యులు ఎన్.రాంచందర్‌రావు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలతలు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా పాతబస్తీలో మజ్లిస్ పార్టీ అక్రమాలు చేస్తుందని కేంద్ర ఎన్నికల కమిషన్ ధర్మంగా ఎన్నికలు నిర్వహించేందుకుగాను అధికారులను కోరుతున్నట్లు తెలిపారు. మజ్లిస్ పార్టీని గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదపడం విచారకరమన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ అట్లూరి రామకృష్ణ, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పాల్గొన్నారు.

రంజాన్‌లో ఉమ్రా దర్శనం అదృష్టం



ఉమ్రా యాత్రికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్: పవిత్ర రంజాన్ మాసంలో ఉమ్రా యాత్ర చేయడం సంతోషకర విషయమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు.రంజాన్ సందర్భంగా జీఎంకె గ్రూప్ నిర్వాహకులతో పాటు పలువురు ఇటీవల ఉమ్రా యాత్రకు వెళ్లారు. ఉమ్రా యాత్ర పూర్తి చేసుకొని వచ్చిన వారిని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ సన్మానించారు. ఉమ్రా యాత్ర పూర్తి చేసుకొని వచ్చిన వారిలో జీఎంకే గ్రూపు వ్యవస్థాపకులు మొహమ్మద్ షకీల్‌అలీ ఖాన్, సీనియర్ పాత్రికేయులు సయ్యద్ అంజద్ షానోరీ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ జోరు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ మంచి జోరుమీద ఉందని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని ఆ పార్టీ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజా మద్దతు మెండుగా ఉందని ఇచ్చిన గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు పరుస్తు వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ, నాయకులు వేణుగౌడ్, బొట్టు రామ్, దుర్గాప్రసాద్, జగన్‌గౌడ్, దర్శన్, వినోద్ చౌగ్లే, నవీన్‌ముదిరాజ్, మధు తదితరులున్నారు.

ఈద్గాల వద్ద భారీ బందోబస్తు



గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: రంజాన్ ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం ఆయన ఈద్గాల వద్ద బందోబస్తును వివరించారు. చారిత్రక కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద వివిధ దళాలకు చెందిన పోలీసులను నియమించామని అన్నారు. కుతుబ్‌షాహీ ఈద్గాకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు ఈద్గా గేటు, సెవన్ టూంబ్స్ గేటు, డెక్కన్ పార్కు గేటు వద్ద కూడా పోలీసు పికెటింగ్‌లు ఉంటాయని ఆయన అన్నారు. అనుమానం వచ్చిన వారిని పూర్తిగా తనిఖీ చేసి లోపలికి వదులుతామని అన్నారు. సెవన్ టూంబ్స్ రోడ్, బంజారి దర్వాజా వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా ద్విచక్ర వాహనాలను బంజారి దర్వాజ నుంచి గోల్ఫ్ కోర్సు రోడ్ గూండా జమాలి దర్వాజ వైపు పంపిస్తున్నామన్నారు. అదే విధంగా గోల్కొండ నుంచి బంజారి దర్వాజ వచ్చే వారు రిసాల బజార్, బంజారి దర్వాజా గూండా కాకుండా జమాలి దర్వాజా మీదుగా గోల్ఫ్ కోర్సు రోడ్డు గూండా బంజారి దర్వాజా వైపు రావచ్చునన్నారు. లంగర్ హౌజ్‌లోని పాంచ్‌కానా ఈద్గా వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఈద్గాకు వచ్చే రోడ్డుతో పాటు ఈద్గా నుంచి ప్రార్ధనలు ముగించుకోని వెళ్లే వారిపై కూడా నానల్‌నగర్ క్రాస్ రోడ్స్, లంగర్‌హౌజ్ రోడ్ల గూండా వెళ్లేలా చూస్తామన్నారు.

ఉత్సాహంగా ఉగాది ఉత్సవాలు



ఉగాది ఉత్సవాల్లో హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డాక్టర్ మాధవీలత

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని శివపార్వతి ఫంక్షన్ హల్‌లో మంగళవారం రాత్రి పాతబస్తీ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డాక్టర్ మాధవీలత పాల్గొని ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పాతబస్తీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తిరుపతి శివ కుమార్, ప్రధాన కార్యదర్శి చుక్కా అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా చైత్ర నవరాత్రి వార్షికోత్సవాలు

జియాగూడ: చారిత్రాత్మకమైన జియాగూడ మహంకాళి దేవాలయంలో దేవీ చైత్ర నవరాత్రి, అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వేడుకల సందర్భంగా మహంకాళి దేవీ అమ్మవారికి అభిషేం, బ్రహ్మాచారినిగా అలంకరణ, హోమం, అన్నప్రసాద కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గౌలిపురా: ఆసుపత్రిలో గాయాలతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన మేరకు.. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌షాహీ కవేలికమాన్ సమీపంలో ఈ నెల 3వ తేదీన ఓ గుర్తు తెలియని 38 ఏళ్ల వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న మొఘల్‌పురా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 7వ తేదీన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అల్లూరి సీతారామరాజునగర్‌లో కూలిన ఇంటిపైకప్పు



బాధితులకు సేవలు అందిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

గోల్కొండ: గుడిమల్కాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజునగర్‌లో ఓ ఇంటి పైకప్పు కూలింది. ఈ ప్రమాదంలో ఆ ఇంట్లో ఉండే ఆరుగురికి గాయాలయ్యాయి. బుధవారం జరిగిన ఈ సంఘటన స్థానికులకు తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఇంటిపై కప్పు కూలిన విషయం డీఆర్ఎఫ్ సిబ్బందికి తెలిపారు. వెంటనే డిఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకొని గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు.